ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
ఆదివారం 2 మార్చి 2025





పశుసంవర్ధక శాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

లక్ష్యం చేరుకోవాలంటే..

మనపై నమ్మకం ముఖ్యం

- ఆలోచనలు వాస్తవానికి దగ్గరగా ఉండాలి
- ఎస్కే యూనివర్సిటీ నాకు లైఫ్ చేంజర్
- సామాన్య కుటుంబంలో రైతుబిడ్డగా జన్మించా..
- ఉపాధ్యాయుడి నుంచి ఎస్పీ వరకూ వచ్చా
- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

(కడప-ఆంధ్రజ్యోతి): ఆయన మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. హలం పట్టి పొలం పనులు చేశారు. ఇంటర్ వరకు సొంతూరులోనే ప్రభుత్వ స్కూలు, కాలేజీలో విద్యాభ్యాసం సాగించారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించి ఉపాధ్యాయుడిగా బెత్తం పట్టుకుని ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఆ బెత్తం వదిలి పోలీసు డిపార్ట్‌మెంటులోకి అడుగుపెట్టారు. ఇప్పుడు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయనే ఈజీ అశోక్‌కుమార్. ఇప్పటి వరకూ సాగిన తన జీవిన ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..

గ్రూప్-1 నా ప్రధాన లక్ష్యం

విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యాలయాల్లోనే సాగింది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నార్పలలో చదువుకున్నా. అనంతపురంలోని ఎస్కే యూనివర్శిటీలో ఎంఏ తెలుగు చేశాను. నాకు చిన్నప్పటి నుంచి గ్రూప్-1 ఆఫీసరు కావాలన్నదే లక్ష్యం. 2006లో నిర్వహించిన డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికయ్యాను. తొలి పోస్టింగ్ తాడిమర్రి మండలం వేమకుంట్లలో ఎస్‌జీటీగా విధుల్లో చేరాను. అక్కడ సంవత్సరం పాటు పనిచేశాను. బదిలీల్లో భాగంగా యల్లనూరు మండలంలోని గొడ్డుమర్రిలో ఏడాది పాటు పనిచేశాను. అప్పుడే గ్రూప్-1 ఎగ్జామ్ రాశాను. 2008లో ప్రిలిమినరీ, 2009లో మెయిన్స్ ఇంటర్వ్యూలు సాగాయి. 2010 మార్చిలో డీఎస్పీగా ఎంపికయ్యాను. నా జీవితకాల లక్ష్యం సాధించాను. ఏడాది పాటు హైదరాబాదులోని పోలీసు ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాను. 2011లో అప్పటి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూలు డీఎస్పీగా తొలి పోస్టింగ్. తరువాత 2013 నుంచి 2014 వరకు చింతపల్లె డీఎస్పీగా పనిచేశాను. 2014 నుంచి 2017 వరకు కడప డీఎస్పీగా పనిచేశాను. 2017 నుంచి 2024 వరకు ఇంటెలిజెన్స్‌లో పనిచేశాను.

యూనివర్సిటీ లైఫ్ చేంజర్

ప్రతి ఒక్కరి జీవితాన్ని చేంజ్ చేసేది యూనివర్సిటీలే. అప్పటి దాకా ఒక చోట ఒకే ప్రాంతానికి చెందిన వారితో కలసి చదువుకుని ఉంటాం. యూనివర్సిటీకి వచ్చేసరికి వివిధ ప్రాంతాలకు చెందిన వారితో కలిసి చదువుకుంటాం. ఒకే గదిలో ఉంటాం. నాకు ఎస్కే యూనివర్శిటీ లైఫ్ చేంజర్. ఎంతో మంది ఇక్కడ నుంచి ఉపాధ్యాయులుగా వచ్చారు. ఇక్కడ చదివినవారు ఎందరో ఉన్నత స్థాయిలో పనిచేస్తున్నారు.

గ్రూప్-1 సాధించాలంటే..

ముందుగా మనపై మనకు నమ్మకం కలగాలి. ఎక్కువ బట్టీ పట్టి చదవకూడదు. గ్రూప్ డిస్కషన్స్ అవసరం. రైటింగ్ ప్రాక్టీసు బాగా చేయాలి.. ఒక సబ్జెక్టుపై అవగాహన కోసం రూమ్‌మేట్స్. హాస్టళ్లలో అయితే గ్రూపుగా ఏర్పడి డిస్కస్ చేయాలి. మనకు ఇచ్చే మూడు గంటల్లో మనం రాసే పరీక్ష మెప్పించాలి. కరెంటు అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలి. మనం ఏం నేర్చుకున్నామో రాయాలి. సబ్జెక్టుపై నాలెడ్జి పెంచుకోవాలి.

వాస్తవానికి దగ్గరగా ఉండాలి

గ్రూప్ 1 పోస్టులు వందల్లో ఉంటే లక్షల మంది దరఖాస్తు చేస్తారు. దానికి మనం భయపడకూడదు. ఈ ఉద్యోగం నేను సాధిస్తాను అనే నమ్మకంతో ముందుకు వెళ్లాలి. ఇంటర్వ్యూల్లో కూడా మన సామర్థ్యం అధికారులు గుర్తిస్తారు. మనం చెప్పే సమాధానాలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయా, లేవా అనేది చూస్తారు. ఇంటర్వ్యూలో మనం ఎలాంటి సమాధానం ఇస్తున్నామో గమనిస్తారు. సబ్జెక్టుపై మన కమాండ్ చూస్తారు. ఇంటర్వ్యూ అప్పుడు కరెంటు అఫైర్స్ కోసం దినపత్రికలు మ్యాగజైన్స్ చదవాలి. అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి.

పొలం పనులు చేశా

మాది అనంతపురం జిల్లాలోని నార్పల గ్రామం. తల్లిదండ్రులు సుబ్బయ్య, సావిత్రమ్మ. మేం ముగ్గురం సంతానం. నేను చిన్నవాన్ని. మాది మధ్యతరగతి రైతు కుటుంబం. కంది, ఉలవలాంటి ఆరుతడి పంటలు సాగు చేసేవారం. చదువుతున్నప్పుడు పొలం పనులకు వెళ్లేవాన్ని.

ఉద్యోగ జీవితంలో..

డీఎస్పీగా తొలి పోస్టింగ్ వచ్చింది. విధి నిర్వహణలో ఎన్నో చాలెంజింగ్ కేసులు ఛేదించాను. ఎంతో మంది బాధితులకు న్యాయం చేస్తుండటంతో చాలా గొప్పగా ఉంది ప్రూఫ్‌లేని మర్డరు కేసులను ఛేదించాను.



ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప డీఎస్పీగా పనిచేస్తున్నప్పుడు 2016లో రెడ్డెప్ప అనే పారిశ్రామికవేత్తను ఓ ముఠా కిడ్నాప్ చేసింది. రూ.40లక్షలు ఇవ్వాలని బెదిరించారు. రిమ్స్, తెలుగుగంగ, గువ్వలచెరువు ప్రాంతాల్లో కిడ్నాపర్లు సంచరిస్తూ డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం వాడి ఆరుగంటల్లోనే కిడ్నాప్ ముఠాను పట్టుకున్నాం. అప్పట్లో 2016లో సీఎం చంద్రబాబుచే బెస్ట్ అవార్డు ఇచ్చారు. అప్పుడు చంద్రబాబునాయుడు లక్ష రూపాయల ప్రైజ్ మనీ కూడా ఇచ్చారు. ఇదే కాకుండా ఎంతో మంది పేదలు, బాధితులకు న్యాయం చేస్తున్నాం. ఎంతో మందికి న్యాయం చేస్తుండటంతో ఈ ఉద్యోగం నాకు సంతృప్తి ఇస్తోంది.

SUNDAY SPECIAL

రైతులను లాభాల బాటలో నడిపించాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య రంగాలను పటిష్టం చేసి రైతులను లాభాల బాటలో నడిపించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా అన్ని గ్రామాల్లో సామాజిక స్థితి గతులు, ఆర్థిక స్థితిగతులు, అక్కడ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేందుకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో 100 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రారంభించాలన్నారు. వీరపునాయునిపల్లి మండలంలోని కృష్ణంపల్లిని ఎంపిక చేశామని, ఆ గ్రామానికి ఆర్థిక పరిపుష్టి చేకూరుస్తామన్నారు. జిల్లాలో ఏడాది లోపు లక్ష ఎకరాలను సాగులోకి తేవాలని, ఉద్యానపంటల సాగు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఫారంపాండ్ ఏర్పాటు చేసే పొలంలో ఉద్యాన మొక్కలు కూడా నాటాలన్నారు. పాడిపరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దార్లను ఆర్థికంగా ముందుకు నడిపించేందుకు సహకారం అందించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషిచేయాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి1 నుంచి 30వ తేదీ వరకు పశు సంవర్థక శాఖ అధికారులు చేపట్టే కార్యక్రమాలపై రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ వెంకట్రామయ్య, వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, అనుబంధ శాఖల అధికారులు శారదమ్మ, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర రెడ్డి, సురేశ్‌కుమార్, విజయలక్ష్మి, పరిమళజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం



కాంగ్రెస్ మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేస్తున్న విజయజ్యోతి

కడప కలెక్టరేట్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ మేరకు శనివారం కడపలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి మాట్లాడుతూ మన జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో పార్టీకి ఇబ్బందులు తప్పలేదన్నారు. అయినప్పటికీ జిల్లాల్లో అన్ని వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ ఉందన్నారు. నూతనంగా నియమితులైన మండల శాఖల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన సేవలను గ్రామగ్రామాల్లో ప్రజలకు వివరించి, పూర్వ వైభవం తెచ్చేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. అలాగే మైనార్టీ విభాగం నుంచి రాష్ట్ర మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖాదర్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా కమాల్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఖాజా మొయినుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా మొహిద్దీన్ ఖాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడుగా రంతుల్లా ఖాన్‌కు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, కడప కో-ఆర్డినేటర్ జకరయ్య, అలీఖాన్, ధ్రువకుమార్ రెడ్డి, ఇర్ఫాన్ బాషా, శివ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 96 శాతం మంది హాజరు



కడపలో పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూకు సంబంధించి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 64 కేంద్రాల్లో 17,906 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 17,196 మంది (96శాతం) హాజరు కాగా 710 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను 8.30గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ప్రథమ సంవత్సరం పరీక్షకు సెట్ 2 ప్రశ్నాపత్రాన్ని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృత్తికా శుక్ల ఎంపిక చేశారు. ఒక్క నిమిషం నిబంధన, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. పరీక్షలకు సంబంధించి బోర్డు ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటటి అవాంఛనీయ సంఘటనలు గాని మాల్ ప్రాక్టీస్ గాని జరగలేదన్నారు.

నిఘా నీడలో..

జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ బోర్డు జిల్లా కేంద్రంతో పాటు రాష్ట్ర కార్యాలయంలోని ప్రత్యేక ప్రసారం ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు పరిశీలించి ఆదేశాలు ఇచ్చారు.

పకడ్బందీగా పది పరీక్షలు : డీఈవో

కడప ఎడ్యుకేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సభాభవనంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎంఈఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. అనంతరం ఉప విద్యాధికారులు రాజగోపాల్‌రెడ్డి, మీనాక్షి, బీసీఈబీ కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జి.వెంకటేశ్ ప్రసంగించారు. ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి, 32 మంది చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో 14వ స్థానం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లాకు 14వ స్థానం లభించింది. జిల్లాలో 2,56,784 మంది పింఛన్‌దారులకు రూ.110.45కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం సాయంత్రం 7గంటల వరకు 2,43,577 మందికి పంపిణీ చేసి 94.86శాతం ప్రగతిని సాధించారు. ఈ నెల నుంచి పింఛన్ పంపిణీ మొబైల్ అప్లికేషన్‌లో మార్పులు చేశారు. ఉదయం 7గంటల నుంచి మాత్రమే యాప్ పనిచేసేలా మార్పులు చేశారు. లబ్ధి దారుల ఇళ్ల వద్ద నుంచి 300 మీటర్లలోపే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. మరో వైపు ఆసుపత్రిల్లో ఉన్నవారు, వృద్ధాశ్రమాలు, స్కూళ్లు, కళాశాలల్లో, దివ్యాంగ విద్యార్థులకు, ఉపాధి హామీ పని ప్రదేశంలో, బంధువుల ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ చేసినా నమోదుకు అవకాశం కల్పించారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను

వైభవంగా నిర్వహిస్తాం

- టీటీడీ ఈవో జె.శ్యామలరావు



రాజంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో జె.శ్యామలరావు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక కోదండ రామాలయానికి వచ్చి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీధర్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ నెల 5 నుంచి 9వ తేది వరకు జరగనున్న మహాసంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు నుంచి ఆలయంలో పనులు నిర్వహిస్తున్నామని, ఈ పనులు పూర్తికానున్నాయన్నారు.

ఏప్రిల్ 6 నుంచి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈవో శ్యామలరావు మాట్లాడుతూ ఏప్రిల్ ఆరో తేది నుంచి 15వ తేది వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, 11న సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం పటిష్ఠ.

(మిగతా 6లో...)


లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరలో
పోటెత్తిన భక్తజనం



6

మైత్రికి వారధి రంజాన్ మాసం

- నేటి నుంచి ప్రత్యేక ప్రార్థనలు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన జామియా మసీదు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): దివ్య ఖురాన్ భూమిపై వెలసిన మాసం వచ్చేసింది. సమస్త మానవ జాతి శ్రేయస్సు కోరే వరాల 'రోజా' రోజులు వచ్చేశాయి. రంజాన్ అంటేనే నవజీవన విధానానికి నాందిగా చెప్పవచ్చు. మానవ జీవన సాఫల్యానికి నిర్దిష్ట ప్రణాళికను అందించే పవిత్ర ఖురాన్ ప్రపంచానికి అందినది ఈ మాసంలోనే. కఠోర శ్రమ, క్రమశిక్షణ, శాంతి సహనాన్ని జనింపజేస్తుంది. శనివారం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం మొదలైంది. మహమ్మద్ ప్రవక్త (స.అ.) ప్రవచనాలకు అనుకూలంగా జీవనం సాగించే ముస్లింలు నియమ నిష్టలతో ఈ నెలంతా ఉపవాస దీక్షలు చేపడతారు.

చెడు పనులు, పాపాలకు దూరంగా ఉండేలా శిక్షణ ఇవ్వడమే ఈ మాసం ప్రత్యేకత. ఈ మాసంలోనే కాక మిగతా కాలం అంతా ఉన్నత మానవత్వపు విలువలతో జీవనం గడిపేందుకు ఈ నెలరోజుల శిక్షణ స్ఫూర్తిగా నిలుస్తుంది. ఈ నెలలో రోజా (ఉపవాసం) ఆచరించడం సంప్రదాయం. సూర్యోదయం మునుపు నుంచి సూర్యాస్తమయందాకా ఉపవాసం ఉంటారు. సూర్యుడి వెలుగు ముగిశాక ఇఫ్తార్‌తో ఉపవాసాన్ని విరమిస్తారు. ఈ కాలంలో సత్కార్యాలు చేయడం పుణ్యాన్ని ఇనుమడింప చేస్తుంది.

విద్వేషాన్ని ప్రేరేపించే ఏ భావాన్ని అయినా త్యజించాలని దివ్య ఖురాన్ ప్రబోధిస్తుంది. దైవారాధన, దాన ధర్మాలు, పవిత్ర ఉపవాస వ్రత ఆచరణ, పరమత సహనాన్ని అలవరుచుకోవడం వంటివి దివ్య ఖురాన్ బోధనలు. ఈ మాసం అంతా ప్రతిరోజూ ఐదు పూటల నమాజు చేయడమేగాక రాత్రి అదనంగా ప్రత్యేక ప్రార్థనలు 'తరావీ' నమాజు ఉంటుంది. ఇది దైవ ప్రసన్నత పొందేందుకు ప్రవక్త సూచించిన మార్గం.

విభిన్న సంస్కృతులు సంప్రదాయాలు, మతాలున్న మన దేశంలో రంజాన్ మైత్రికి వారధి అని చెప్పవచ్చు. ముస్లింలతో పాటు ఇతరులు కూడా రోజా ఉండటం మత సామరస్యానికి ప్రతీక. రోజా ఉన్నవారికి ఇఫ్తార్ ఇచ్చిన వారికి సమాన పుణ్యం ప్రాప్తిస్తుందని విశ్వాసం. నిష్కళంకమైన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకుని దైవమార్గంలో త్యాగ నిరతిని పెంపొందించుకునేందుకు ఈ ఉపవాస వ్రతం దోహదపడుతుంది.

రూ.10 కోట్ల ప్రభుత్వ స్థలం కబ్జా

- కబ్జా బ్యాచ్‌కు టీడీపీలోకి వచ్చిన ఓ వైసీపీ నేత అండ
- ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాతో ఒప్పందం
- నీటి మునక అని తెలిసినా కాసులకు కక్కుర్తి పడి రిజిస్ట్రేషన్



నీటి మునక స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చిన్నచౌకు రెవెన్యూపొలం సర్వేనెం.955లో 23సెంట్లు నీటి మునక భూమి ఉంది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లోనూ, ఆర్‌ఎస్‌ఆర్‌లోనూ నీటి మునకగానే నమోదై ఉంది. కలెక్టరేట్‌కు సమీపంలోనే రహదారి పక్కనే ఈ భూమి ఉంది. ఈ ఏరియాలో సెంటు రూ.40లక్షల నుంచి రూ.50లక్షల మధ్య ధర పలుకుతోంది. అంటే మార్కెట్ ధర ప్రకారం ఎంత తక్కువ అనుకున్నా ఈ 23 సెంట్ల స్థలం రూ.10కోట్ల విలువ చేస్తుంది. ఈ భూమిపై జగన్ హయాంలోనే ఓ ముఠా కన్నువేసింది. వైసీపీకి చెందిన ఓ మాజీ కౌన్సిలరు, కార్పొరేటరు ఇతర బ్యాచ్ దీన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి అప్పట్లో ప్రచురించింది. దీంతో అధికారులు వేగంగా స్పందించి ఆక్రమణను అడ్డుకుని ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతారు. అయితే ఈ స్థలాన్ని వ్యూహాత్మకంగా కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇది మాదంటూ కోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం స్టేటస్‌కో ఇచ్చింది. దీన్ని అడ్డుపెట్టుకుని కబ్జాదారులు రంగంలోకి దిగారు.

ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములా

కడప టీడీపీలో ఇప్పుడు వైసీపీ నుంచి వచ్చిన వలస పక్షులదే రాజ్యం. ఈ స్థలం కబ్జా వ్యవహారంలో కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి చక్రం తిప్పుతున్న వ్యక్తి ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాతో సెట్ చేస్తానని అభయం ఇచ్చారని ప్రచారం ఉంది. అందుకే ఆ ఖాళీ స్థలంలో ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఎన్నికల ముందు ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన శివరామిరెడ్డి నీటి మునకగా ఉన్న ఆ భూమిలో అక్రమ కట్టడాలు తొలగించాలంటూ ఆదేశాలు ఇచ్చారు. దీనిపై చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వైసీపీ గవర్నమెంటులో అన్యాక్రాంతం కానీ ఈ భూమి.. టీడీపీ గవర్నమెంటులో కాజేసే యత్నం జరగడం గమనార్హం. అది కూడా ఆ నేత ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాతో ఒప్పందం కుదుర్చుకోవడంతో కబ్జాదారులు రంగంలోకి దిగి అక్కడ దుకాణాలు ఏర్పాటుచేసే యత్నం చేశారు. గతంలో కడప సబ్‌రిజిస్ట్రేషన్ శాఖలో ఓ అవినీతి అనకొండ పనిచేసింది. ఆయన నేతృత్వంలో వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను అక్రమ రిజిస్ట్రేషన్లతో అప్పజెప్పారు. అందులో భాగంగా ఇది కూడా రిజిస్ట్రేషన్ జరిగిందంటారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి కడప తహశీల్దారు నారాయణరెడ్డిని వివరణ కోరగా.. ఇది పక్కా ప్రభుత్వ భూమి అని అయినా దీనిపై రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ఆ రిజిస్ట్రేషన్ రద్దుకోసం కలెక్టర్‌కు నివేదిక పంపించామన్నారు.



పీలేరు వాసవీ అమ్మవారిని దర్శించుకుంటున్న దూండి రాకేశ్, తదితరులు

కూటమితో ఆర్యవైశ్యులకు గౌరవం

● ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేశ్

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం ఆర్యవైశ్యులకు చంద్రబాబు ప్రభుత్వం గౌరవం కల్పించిందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేశ్ అన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 'యువగళం' పాదయాత్రలో నారా లోకేశ్‌కు రాష్ట్ర ఆర్యవైశ్యులు చేసిన విజ్ఞప్తిపై స్పందించి అధికారంలోకి వచ్చిన తరువాత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ఆర్యవైశ్యులందరికీ గౌరవం కల్పించినట్లైందన్నారు. అలాగే పొట్టి శ్రీరాములు జయంతిని కూడా అధికారికంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందని, వచ్చే ఏడాది నుంచి ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఆర్యవైశ్య సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ బద్రీనాథ్, పీలేరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బలసా వేణుగోపాల్, సభ్యులు గణపతి, వంశీ, మహేశ్ గుప్తా, నాగరాజ, రేవూరి సుధీర్, జయచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవాలు

మదనపల్లె అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మహాకుంభాభిషేక మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి అమ్మవారి చిత్రపటం, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేష్ హాజరయ్యారు. కన్యకాపరమేశ్వరీ మాతను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, ప్రధాన కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి సూరే గిరిధర్, ఎల్లంపల్లె ప్రశాంత్, ప్రవీణ్, వాసవీ మహిళా సంఘాల సభ్యులు పర్యవేక్షించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు తమ అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పీలేరు డివిజనల్ ఇంజనీరు చంద్రశేఖర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెల్లించాల్సిన రుసుములో 50శాతం రాయితీ కల్పించిందని ఆయన తెలిపారు. 1 కిలోవాట్ అదనపు లోడుకు ఇది వరకు రూ.2250 చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం దానిని రూ.1250లకు కుదించారన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు, ఆధార్ కార్డులతో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట



ఎస్పీ కార్యాలయ ఆవరణలో ప్రేమికులు

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును శనివారం ఓ ప్రేమజంట ఆశ్రయించింది. ఆ వివరాల్లోకి వెళితే.. చిట్వేలి మండల పరిధిలో ఉన్న నగిరిపాడు గొల్లపల్లెకు చెందిన పవన్ కుమార్, మదనపల్లెకు చెందిన శిల్ప ప్రేమించుకున్నామని, తల్లిదండ్రులకు ఈ విషయాన్ని వివరించామని తెలిపారు. అయితే ఇరువురు తల్లిదండ్రులు ఇందుకు అంగీకరించలేదని, దీంతో తాము కడప ఆంజనేయస్వామి ఆలయంలో వెళ్లి వివాహం చేసుకున్నామన్నారు. దీంతో తమ కుటుంబ సభ్యులు చంపుతామని బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కావాలని పోలీసులకు విన్నవించారు. తాము మేజర్లమని, ఇందుకు సంబంధించిన సర్టిఫికేట్లు ఉన్నాయన్నారు. కాగా శిల్ప తిరుపతిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పవన్‌కుమార్ ఫ్లిప్‌కార్ట్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రామసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మాలేనత్తం పంచాయతీ కుప్పనపల్లెకు చెందిన గంగులప్ప(62) కుదురుచీమనపల్లెలో పనికి వెళ్లి చింతకాయల కోసం చెట్టు ఎక్కాడు. కాయలు కోస్తుండగా చెట్టు కొమ్మలను ఆనుకుని ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్ తగలడంతో మృతి చెందాడు. చెట్టు కింద కాయలు ఏరుతున్న ప్రమీలమ్మపై మృతుడు పడటంతో ఆమెకు కాలు విరిగింది. 108లో ఆమెను ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన గంగులప్పకు ముగ్గురు కూమార్తెలు. చెట్టుకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను సరిచేయకపపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, విద్యుత్ అధికారుల నిర్ల క్ష్యానికి నిదర్శనమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గేదెల మృతి

సంబేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లి గ్రామం ఎర్రగుంట్ల హరిజనవాడ నివాసి అయిన అంజనమ్మకు చెందిన 3 గేదెలు, 3 దూడలు శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాయి. మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన గేదెలు కాళ్ళు బిగుసుకుపోయి ఒక్కసారిగా కింద పడి ప్రాణాలు విడిచినట్లు బాధితురాలు తెలిపారు. ఒకేసారి ఆరు మూగజీవాలు మృతి చెందడంతో ఆమె బోరున విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.


రామన్న స్థలాలపై.. టీటీడీ నిర్లక్ష్యం..

వాల్మీకిపురం పట్టాభిరాముడిపై మండల ప్రజలకు భక్తి ఎక్కువ. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కానీ శతాబ్దాల చరిత్ర కలిగిన పట్టాభిరాముడి ఆలయ స్థలాలపై టీటీడీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు వస్తే కానీ ఆయా స్థలాలపై శ్రద్ధ చూపడం లేదు. శిథిలావస్థలో ఉన్న మండపం, గరుడ పుష్కరిణిని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. స్వామివారి చక్రస్నాన ఘట్టం ఒక గంగాళం నీటిలో చేస్తున్నారంటే ఎంతటి నిర్లక్ష్యమో అర్థమవుతోంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి మరమ్మతుల దిశగా చర్యలు తీసుకుంటారని భక్తుల కోరిక.



బ్రహ్మోత్సవాలలో గంగాళంలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు(ఫైల్‌ఫొటో)





- దుర్గంధంగా కల్యాణ వేదిక స్థలాలు
- శిథిలావస్థలో పార్వేట మండపం
- గరుడ పుష్కరిణి అభివృద్ధి ఏనాటికి జరిగేనో..?
- భక్తుల ఆవేదన

వాల్మీకిపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉందని పెద్దల మాట. అలాంటి ఆలయం టీటీడీ ఆధీనంలోకి వెళ్లినప్పటి నుంచీ ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాల్లో ఎంతో ప్రాచుర్యం సంతరించుకుంది. ఆలయానికి సంబంధించిన స్థలాలు పలుచోట్ల అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్నాయి. బైపాస్ రోడ్డులో తోటవీధి ప్రాంతంలో ఉన్న టీటీడీ స్థలాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఏటా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇదే ప్రాంతంలో భారీ ఏర్పాట్ల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తుంటారు. వారం రోజుల బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తారు. కల్యాణం అనంతరం ఈ స్థలాలను పట్టించుకోవడం లేదు. మళ్లీ మరుసటి ఏడాది వస్తే కానీ టీటీడీ అధికారులు ఈ స్థలాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. టీటీడీకి సంబంధించిన రెండెకరాలకు పైగా స్థలాలకు గొప్పగా ప్రహరీ, గేట్లు ఏర్పాట్లు చేసినా అన్యాక్రాంతంగా మారిపోతున్నాయి. ఆలయ స్థలాలని తెలిసినా కొందరు దుర్గంధంగా తయారు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 15 ఏళ్లగా స్వామివారి కల్యాణ వేదిక ఏర్పాట్ల ఖర్చు ఇప్పటివరకు చూస్తే రూ.కోటి పైమాటే. కానీ శాశ్వత షెడ్లు నిర్మిస్తే టీటీడీకి ఆదాయం, ఖర్చు కూడా తగ్గుతుంది. అలాగే సీతారాముల కల్యాణం జరిగే ప్రాంతంలో పేద కుటుంబాలు పెళ్లిళ్లు చేసుకునేలా మండపం ఏర్పాటు చేయాలని, ఆ దిశగా టీటీడీ అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఉన్న టీటీడీ స్థలాలను కూడా పట్టించుకోకపోవడం విచారకరం.

శిథిలావస్థలో పార్వేట మండపం


పట్టాభిరామాలయానికి అనుబంధంగా ఉన్న పార్వేట మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. అది నేడోరేపో కూలేందుకు సిద్ధంగా ఉన్నా టీటీడీ ఏమాత్రం పట్టించుకోలేదు. మండపం స్తంభాలపై అనేక శిల్పాలు, దేవుడి బొమ్మలు ఉన్నాయి. ప్రస్తుతం ఫ్లోరింగ్ లేక బండలు ఎక్కడపడితే అక్కడ పడున్నాయి. పైకప్పుపై మట్టి పేరుకుపోయి గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి. చారిత్రక శిల్పకళను కాపాడి పార్వేట మండపం భావితరాలకు ఉపయోగపడేలా టీటీడీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్వం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో చక్రస్నాన ఘట్టాన్ని స్వామివారి గరుడ పుష్కరిణిలో వైభవంగా నిర్వహించేవారు. గడిచిన పదేళ్లలో చక్రస్నాన ఘట్టాన్ని భక్తులు తిలకించలేకపోవడం బాధాకరం. ప్రస్తుతం గంగాళం నీటిలో స్వామివారి చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి కల్యాణ వేదిక స్థలాలు, పార్వేట మండపం, గరుడ పుష్కరిణి అభివృద్ధి పట్ల చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

కల్యాణ వేదిక స్థలాలను పరిశీలించి శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతాం. స్థానికుల అభిప్రాయాల మేరకు ప్రతి విషయం టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పట్టాభిరామాలయ పార్వేట మండపం, గరుడ పుష్కరిణిలో పునరుద్ధరించే దిశగా ఉన్నతాధికారులతో చర్చిస్తాం. - కృష్ణమూర్తి, ఈవో, పట్టాభిరామాలయం, వాల్మీకిపురం



దుర్గంధంగా పట్టాభిరాముడి కల్యాణ వేదిక స్థలాలు



శిథిలావస్థకు చేరిన పార్వేట మండపం



నిరుపయోగంగా కోనేటివీధిలోని పట్టాభిరాముడి గరుడ పుష్కరిణి

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు : సబ్ కలెక్టర్



రైతుల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

బి.కొత్తకోట మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించాలని, భూ ఆక్రమణదారులపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఫ్రీహోల్డ్ భూములు, రెవెన్యూ సదస్సు అర్జీలు, భూముల రీసర్వే, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి వీఆర్వోను విడివిడిగా మాట్లాడి ఆయా రెవెన్యూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌పై వివరణ కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూసమస్యలపై 5890 అర్జీలు వచ్చాయని, వాటిలో 4669 పరిష్కారించారన్నారు. బి.కొత్తకోట మండలంలో అత్యధికంగా 1023 అర్జీలు ఇచ్చారని, వాటిలో సరైన ఆధారాలు ఉన్న వాటిని పరిష్కరించి లేనివాటికి ఎండార్స్‌మెంట్ ఇచ్చామన్నారు. హార్సిలీహిల్స్‌లో టౌన్‌షిప్ కమిటీ మీటింగ్ త్వరలో నిర్వహించి అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ భూసమస్యలపై స్థానికులు ఇచ్చిన అర్జీలను తీసుకుని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజారుద్దీన్, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

నిమ్మనపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చిన వృద్ధురాలు ఓబులమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ముష్టూరు పంచాయతీకి చెందిన ఓబులమ్మ బెంగళూరులో కుమారుడి వద్ద ఉంటోంది. అయితే వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఆమె తన మనవడి కోసం ముష్టూరు క్రాస్ వద్ద వేచివుంది. ఇంతలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలో ఉన్న 25గ్రాముల బంగారు గొలుసును లాక్కుని మదనపల్లె వైపునకు వెళ్లిపోయారు. గొలుసు విలువ సుమారు రూ.లక్ష 70వేలు వుటుందని, ఆమె కుమారుడు వాసుదేవ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

మదనపల్లె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మదనపల్లె మున్సిపల్ పరిధిలోని సిద్ధమ్మ లేఅవుట్, పీఅండ్‌టీ కాలనీ, సొసైటీ కాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డెప్పకాలనీలలో రూ.1.66 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం శనివారం భూమి పూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చైర్ పర్సన్ మనూజ అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేణుక, నాయకులు నవీన్‌చౌదరి, భాస్కర్, నాగయ్య, రామకృష్ణ, రమణ, శశికుమార్, రంగస్వామినాయుడు, సహదేవనాయుడు, జాన్‌బాబు, జేసీబీ ఈశ్వర్ నాయుడు, జీవీ నాయుడు, విజయమ్మ, పులి మహాలక్ష్మి, రాధా, జాఫర్‌రున్నిస్సా పద్మమ్మ, మాజీ కౌన్సిలర్ బాబ్జి, జనసేన వీర మహిళ దాదం అనిత తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో ప్రసంగిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

● టీటీడీ ఈవో శ్యామలారావు

(5వ పేజీ తరువాయి..)

ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు వచ్చే అవకాశం ఉందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, టీటీడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా వృషభలగ్నంలో ఉదయం 9.30 నుంచి 10.15 గంటల మధ్య ధ్వజారోహణం, సాయంత్రం శేషవాహనం, 7న వేణుగాన అలంకారం, హంస వాహనం, 8న వటపత్రశాయి అలంకారం, సింహవాహనం, 9న నవనీతకృష్ణ అలంకారం, హనుమంత వాహనం, 10న మోహినీ అలంకారం, గరుడసేవ, 11న శివ ధనుర్బాణ అలంకారం, సీతారాముల కల్యాణం (రాత్రి 8.30 గంటలకు), గజవాహనం, 12న రథోత్సవం, 13న కాళీయమర్దన అలంకారం, అశ్వవాహనం, 14న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, 15న రాత్రి పుష్పయాగం ఉంటుందని తెలిపారు.

టీడీపీ నేతల వినతి..

ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఎన్నో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని ఈవోకు ఒంటిమిట్ట టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా గతంలో సీఎం చంద్రబాబునాయుడు రూ.వంద కోట్ల అభివృద్ధి ప్రణాళికను ప్రకటించగా ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. చెరువు కట్టపై ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేయాలని, శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని, అసంపూర్తిగా ఉన్న కల్యాణమండపాన్ని పూర్తి చేయాలని, బోటు షికారు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టీడీపీ బీసీ నేత ఎస్వీ రమణ ఉన్నారు.

శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం

కలకడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం త్రిశూల స్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ఉన్న పుష్కరిణిలో జలాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, వసంతోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, శ్రీనివాసులునాయుడు, రెడ్డెప్పనాయుడు, జి.కుమార్‌నాయుడు, మల్లికార్జుననాయుడు, హిమగిరినాయుడు, రైస్‌మిల్ రమణ, నరసింహులు, పుణ్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరులో త్రిశూల స్నానం చేస్తున్న అర్చకులు, భక్తులు

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరుణించి కాపాడమ్మా గంగమ్మతల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతరలో భాగంగా శనివారం నిండు తిరుణాళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పుట్టినిల్లు అయిన చాగలగుట్టపల్లె నుంచి తెల్లవారుజామున బయలుదేరి ఉదయం 7గంటలకు గంగమ్మజాతరకు చేరుకోగానే జాతర మొదలైంది. సంప్రదాయబద్ధంగా రోడ్డు రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీసమేతంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే కలెక్టర్ చామకూరి శ్రీధర్ దంపతులు, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా గొల్లపల్లె చెల్లు వంశీయులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పొంగుబాలు సమర్పించారు. అనంతరం ఈడిగపల్లెకు చెందిన ఈడిగ కులస్తులు కల్లు తీర్థం, చౌటపల్లెకు చెందిన రామయ్య కుటుంబీకులు సిద్ధలకూడు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి 10గంటలకు ఆలయం చుట్టూ కుంకుమ బండ్లు, చాందినీ బండ్లను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో, బాణాసంచా పేల్చుతూ వైభవంగా ఊరేగించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు, మండల యువజన నాయకుడు యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో 25 ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేశారు. మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, మరుగుదొడ్లు, పారిశుధ్యం తదితర వసతులను ఏర్పాటు చేశారు. అలాగే మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పోలీసుల పర్యవేక్షణ

గంగమ్మజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర చుట్టూ నాలుగు ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు.

ఘనంగా బండలాగుడు పోటీలు

గంగమ్మజాతర సందర్భంగా ఎద్ల బండలాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల ఎద్దు పాల్గొన్నాయి. బాలయ్యగారిపల్లె, ఆలంఖాన్‌పల్లె, గొల్లపల్లె, కుమ్మరికొట్టాలు, తిప్పిరెడ్డిపల్లె, ఓబులంపల్లె, పోతిరెడ్డిపల్లె, ప్రాంతాలకు చెందిన ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.లక్షను శ్రీనివాసగౌడ్, ద్వితీయ బహుమతి రూ.80వేలు మండిపల్లి కుటుంబీకులు, తృతీయ బహుమతి రూ.60వేలను శివప్రసాద్ అందజేశారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి మండిపల్లి



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన జబర్దస్త్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా రేలారే..రేలా జానపద గేయాలు, అనంతరం పంచ్ ప్రసాదు, చలాకీ చంటి, మరికొంత మంది జబర్దస్త్ కళాకారులు భక్తులను కడుపుబ్బ నవ్వించారు. ఆర్కెస్ట్రా కళాకారులు సినిమా పాటలు పాడారు.

'రాష్ట్ర బడ్జెట్ కోతల బడ్జెట్'

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కోతల బడ్జెట్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్-6 హామీలతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, బడ్జెట్‌లో సూపర్-6 హామీలకు మంగళం పాడారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కోసం బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో 83 లక్షల మంది విద్యార్థులు ఉండగా వారికి తల్లికి వందనం పథకానికి కేవలం 9,407 కోట్లు కేటాయించారన్నారు. అన్నదాన సుఖీభవ పథకానికి 10,600 కోట్లు అవసరం కాగా రూ.6,300 కోట్లతో సరిపెట్టారని విమర్శించారు. 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు పింఛన్లు ఇవ్వడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని తెలిపారు. మహిళా శక్తి పథకానికి, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఎటువంటి నిధులు కేటాయించలేదన్నారు. సాగునీటి రంగానికి నాలుగు శాతం నిధులు మాత్రమే కేటాయించారని, దీని వలన ప్రాజెక్టుల నిర్మాణంలో పురోగతి ఉండదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పీఎండీ నజీర్, జిలానీబాష, ఖాజాపీర్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● మార్చి 6 వరకు గడువు





కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్‌లో చేరేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచిత విద్య, భోజనం, వసతి, పుస్తకాలు పొందే అవకాశం ఉంటుంది. అర్హులైన వారు మార్చి 6లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఆయా గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు. జిల్లాలోని 13 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాల, బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలకు ప్రవేశపరీక్షలు నిర్వహిస్తున్నారు. 5వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12గంటల మధ్య ప్రవేశపరీక్ష ఉంటుంది. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ప్రవేశం పొందిన వారికి టెక్స్ బుక్కులు, నోట్‌బుక్కులు ఉచితంగా ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్య పొందే అవకాశం ఉంటుంది.

అర్హులు వీరే... : 5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, బాలబాలికలు 2012 సెప్టెంబరు 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. బీసీ, ఓసీ, బీసీ-సి వర్గాలకు చెందిన విద్యార్థులు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. అదేవిధంగా జూనియర్ ఇంటర్‌కు సబంధించి 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థుల తల్లి దండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉండకూడదు. ఒక్కో పాఠశాలలో 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు గ్రూపులలో 40సీట్ల చొప్పున 80 సీట్లు ఉంటాయి.

ప్రతిభ ఆధారంగానే సీట్లు

ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు కల్పిస్తాం. జిల్లాలో 13 స్కూళ్లలో 1040 సీట్లు ఉంటాయి. ఇంటర్ రెండు గ్రూపులకు కలిపి 880 సీట్లు ఉంటాయి. అర్హులైన పేద కుటుంబాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-అంపావతి ఉదయశ్రీ, జిల్లా కోఆర్డినేటర్

పాఠశాలలు, కళాశాలలు ఇవే...

బాలురు : బ్రహ్మంగారిమఠం -1,2, గండి క్షేత్రం, పులివెందుల, సగిలేరు. **బాలికలు:** చిన్నచౌకు, కమలాపురం, తొండూరు, మడకల వారిపల్లె, రాజుపాలెం, కొండాపురం, పులివెందుల, గుండ్లకుంట.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్



ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

కడప కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం రిజర్వాయర్ల ద్వారా సుస్థిరమైన సురక్షిత తాగునీరు అందించేందుకు తలపెట్టి న ప్రాజెక్టు ప్రణాళికల సన్నద్ధతపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాలకు ఎలాంటి తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులకు ప్రతిపాదనలను అందజేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తెలుగుగంగ ఆర్-1, బ్రహ్మంసాగర్, మైలవరం, గండికోట, చిత్రావతి రిజర్వాయర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 55 ఎల్‌పీసీడీ (రోజుకు వినియోగించే తలసరినీరు) పట్టణ ప్రాంతాల్లో 135 ఎల్‌పీసీడీ శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌వీ కన్సల్టెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అబార్షన్లు చేస్తున్న ఆర్ఎంపీ గుట్టురట్టు

● ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసిన వైద్యశాఖ అధికారులు

కడప కలెక్టరేట్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తున్న ఆర్ఎంపీ గుట్టు రట్టయ్యింది. వైద్యశాఖ డెమో సెక్షన్‌కు సమాచారం అందడంతో శనివారం జిల్లా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో డెమో సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులు చేసి.. అబార్షన్లకు, కాన్పులకు వినియోగిస్తున్న ఇంటిని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని అక్కాయపల్లెలో ఆర్ఎంపీ ప్రభావతి ప్రథమ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తోంది. శనివారం తన ప్రథమ చికిత్స కేంద్రంలో ఓమహిళకు అబార్షన్ చేస్తున్నట్లు డెమో అధికారులు భారతి, రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారీలకు సమాచారం అందింది. వెంటనే సంబంధిత అధికారితో కలిసి ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేసి అబార్షన్ చేయించునేందుకు వచ్చిన మహిళను గుర్తించారు. వెంటనే ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. గుర్తింపు పొందిన గైనకాలజిస్టుల పర్యవేక్షణలో జరగాల్సిన అబార్షన్లను పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను ఉల్లంఘించి ఇంటిలో చేస్తుండటంతో ఆర్ఎంపీపై చర్యలు తీసుకున్నారు. ఇంటిని సీజ్ చేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ పాలేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా వారోత్సవాలు ప్రారంభం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని డి-బ్లాక్ నుంచి భేటి బచావో-భేటి పడావో అనే నినాదంతో బైక్ ర్యాలీని ప్రారంభించారు. జేసీ అదితి సింగ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ 3వ తేదీన బాల్య వివాహాల నిర్మూలన కోసం కొవ్వొత్తుల ర్యాలీ, మండల కార్యాలయాల వద్ద సంతకాల సేకరణ నిర్వహించాలన్నారు. 4వ తేదీన పౌష్టికాహారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 5న కౌమార దశ బాలికలకు కెరీర్ అవకాశాలపై అవగాహన తరగతులు, 6న బ్యాంక్ మేళా, 7న మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమాలు, 8న జిల్లాస్థాయిలో మహిళా, చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన నిర్వహించనున్నట్లు వివరించారు.

నలుగురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లు అరెస్టు

● రూ.5.60 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, పట్టుబడిన బుకీలతో సీఐ లింగప్ప

జమ్మలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం రాత్రి నలుగురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రావులకొల్లు నాగేంద్ర, జమ్మలమడుగు పట్టణానికి చెందిన సకిలిగిరి మాలిక్‌బాష, డి.జమాల్‌బాష, గడ్డం మాలిక్‌లు జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బెట్టింగ్‌కు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఢిల్లీక్యాపిటల్స్ వీఎస్ ముంబై జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను చూస్తూ పై నలుగురు వ్యక్తులు పందెం కాస్తున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5.60 లక్షలు నగదు, నాలుగు ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, బెట్టింగ్ రాయుళ్ల వద్ద భారీగా డబ్బులు పట్టుబడినట్లు జమ్మలమడుగు పట్టణంలో ప్రచారం ఉంది.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

● పొలం తగాదాలే హత్యకు కారణం : డీఎస్పీ

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం దిగువపల్లె గ్రామానికి చెందిన పప్పూరి గంగిరెడ్డి హత్యకు పొలం తగాదాలే కారణం అని డీఎస్పీ మురళీ తెలిపారు. హత్యకేసులో నిందితుడు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ బొర్ర ప్రతాప్‌రెడ్డి (45)ని శనివారం సాయంత్రం 5గంటలకు పులివెందుల రూరల్ ఇన్‌స్పెక్టరు ఎన్‌వీ రమణ అరెస్టు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మీడియా సమావేశంలో తెలిపారు.

దిగువపల్లెకు చెందిన కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి అతని అన్న కేతిరెడ్డి నాగేశ్వ ర్‌రెడ్డికి ఒక్కొక్కరికి 4ఎకరాల 50 సెంట్లు చొప్పున వ్యవసాయ భూమి ఉంది. ప్రతాప్‌రెడ్డి అన్నకు అప్పులు ఉండటంతో సుమారు పదేళ్ల క్రితం అతని 4 ఎకరాల 50 సెంట్లు వ్యవసాయ భూమిని దిగువపల్లెకు చెందిన పప్పూరు గంగిరెడ్డి చిన్నకుమారుడు దామోద ర్‌రెడ్డికి అమ్ముకున్నాడు. దీంతో ప్రతాప్‌రెడ్డి పొలంలో అరటిపంట కోత ఉన్నప్పుడు లారీ వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈవిషయమై పప్పూరి గంగిరెడ్డితో గొడవపడుతూ ఉండేవాడు. ఈ నేప ధ్యంలోనే తన అన్న పొలం నుంచి తనకు ఎందుకు దారి ఉండ దంటూ ఫిబ్రవరి 24న పొలం వద్ద గంగిరెడ్డితో ప్రతాప్‌రెడ్డి ఘర్షణ పడి మచ్చు కొడవలితో నరికి చంపాడు. ఈవిషయం నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎన్‌వీ రమణ, లింగాల మండల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలి

● అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

● జిల్లా ఇన్‌చార్జ్ సప్లయర్స్ ఆఫీసరు చంద్రిక



రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న జిల్లా సివిల్ సప్లై అధికారి

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనం ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని.. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా సివిల్ సప్లై అధికారి చంద్రిక అన్నారు. జేసీ అదితి సింగ్ ఆదేశాల మేరకు ఆమె నిత్యావసర సరుకులు పంపిణీని స్థానిక ఆర్డీవో, తహసీల్దారులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామం, పులివెందుల పట్టణంలోని వార్డుల్లో శనివారం ఉదయం రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందా లేదా అని ఆరా తీశారు. పంపిణీ చేసేవారికి తగు సూచనలు చేశారు. పట్టణంలో గత రెండు నెలలుగా కందిబేడలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు అడగ్గా ప్రభుత్వం నుంచి షార్టేజీ ఉండడం వల్ల రాలేదని.. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తాయన్నారు. మొత్తం 14 ఎండీయూ వాహ నాలు ఉండగా... 12 వాహనాల ద్వారానే పంపిణీ జరుగుతుందని.. మిగ లిన రెండు వాహనాలను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. రేషన్ పంపిణీ జరిగే చోట ఎక్కడైనా లబ్ధిదారులు తీసుకోవచ్చు అని.. ప్రతి రేషన్‌షాప్‌లో 1వ తేదీ నుంచి 15 వరకు కచ్చితంగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, తహసీల్దారు మహ్మద్ నజీర్, డిప్యూటీ తహసీల్దారు సుధీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీ నేత పీరయ్య ఆకస్మిక మృతి



కడప మారుతీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ నాయకుడు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మాజీ కౌన్సిల్ మెంబర్ పోతుగంటి పీరయ్య ఆకస్మిక మృతి చెందాడు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పీరయ్య మృతి బాధాకరమని.. పార్టీకి తీరని లోటు అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ అన్నారు. అలాగే పీరయ్య మృతి పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, వీఎస్ అమీర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడిగా, తెలుగు దేశం పార్టీ నాయకుడిగా ఆయన చేసిన కృషి పార్టీ ఎన్న టికీ మరువలేదన్నారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మృతి



జగన్మోహనాచార్యులు (ఫైల్)


సత్యవేడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు (54) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో పరీక్షల ప్రధాన అధికారిగా ఆయన శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులు పూర్తయ్యే సరికి పొద్దుపోయింది. ఇంటికి (తిరుపతికి) వెళ్లకుండా రాత్రి కాలేజీలోనే బసచేశారు. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో స్పృహ కోల్పోయారు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందారు. తిరుపతిలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కళాశాలకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ మరణంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వస్థలం కడప జిల్లా జమ్మలమడుగు మండలం. 2023లో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మహిళా పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌస్

కడప క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మహిళా పీఎస్‌లో విద్యార్థినులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు మరియు సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్త లపై మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ వివరించారు. పోలీసుస్టేషన్‌లో పోలీసుల విధులు, ఉపయోగించే రికార్డులు, వినియోగించే వస్తువుల గురించి ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థినులకు వివరించారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి ప్రమాదాల్లో చిక్కుకున్నా వెంటనే సహాయం అందించేలా హెల్ప్‌లైన్ నెంబర్లు తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీసు హెల్ప్‌లైన్ 100, 112, సైబర్ క్రైం హెల్ప్ లైన్ 1930లను సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.క్రిష్టారెడ్డి, ఏహెచ్‌టీ యూ ఇన్‌స్పెక్టర్ జి.ఈదురుబాషా, ఎస్ఐలు శ్రీనివాసులు, శాంత మ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గోమాతల సేవలో..



మానవసేవే మాధవ సేవ అంటారు.. ఈ సూక్తిని ఆదర్శంగా తీసుకున్నారు కొందరు గో ప్రేమికులు.. ఆకలి దప్పికలతో అలమటిస్తూ.. ఏవి దొరికితే (ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు, ఎముకలు) అవి తింటూ మృత్యు వాత పడుతున్న ఆవులను చూసి చలించిపోయారు. వాటి ఆలనా పాలన కోసం గోశాలలను ఏర్పాటు చేసి.. వాటి సేవలో తరిస్తున్నారు.

● ఆవుల సంరక్షణ కోసం గోశాల ఏర్పాటు



ముక్తిదామ గోశాల ప్రాంగణంలో ఉన్న ఆవులు



కొండ ప్రాంతంలో పెంచుతున్న పశుగ్రాసం

దువ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయి సమీపంలోని తెలుగుంగ సబ్సిడరీ రిజర్వాయర్-1 వద్ద పర్లపాడుకు చెందిన జయరామిరెడ్డి, మరో గోప్రేమికుడు హరికృష్ణ ఆధ్వర్యంలో ముక్తిదామ గోశాలను ఏర్పాటు చేశారు. 2016 సంవత్సరంలో 11 ఆవుల పెంపకం చేపట్టి.. వాటి ఆలనా పాలన చూసేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిండి లేక ఆకలితో అలమటిస్తూ ఆవులు మృతి చెందాయి. వైద్యులు పోస్టు మార్టం చేయగా వాటి కడుపులో ప్లాస్టిక్ కవర్లు బయటపడ్డాయి. దీంతో చలించి పోయిన గోశాల నిర్వాహకులు ఓ షెడ్డును ఏర్పాటు చేసి.. వివిధ ప్రాంతాల నుంచి 200 ఆవులను తీసుకువచ్చి వాటికి సేవ చేయడం మొదలు పెట్టారు. వీరికి కొందరు దాతల సహకారం తోడు కావడంతో కమిటీ ఏర్పాటు చేసుకుని ఏడేళ్లుగా ఆవుల సేవలో తరిస్తున్నారు. ప్రస్తుతం 250 ఆవులకు ఈ ప్రాంతం జీవనాధారమైంది.

ఆవుల సంరక్షణకు...

ముక్తిదామ గోశాలను ప్రస్తుతం రూ.10 కోట్ల వ్యయంతో కొనసాగిస్తున్నారు. ఆవుల సంరక్షణకు మూడు షెడ్లను ఏర్పాటు చేశారు. షెడ్లలో చల్లదనం కోసం ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మించి 15 ఎకరాల్లో పశుగ్రాసం పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, ఎన్.రాఘవరెడ్డి, జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంగన హరినాథరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, గురివిరెడ్డి గోశాలను సందర్శించి ఆవుల సంరక్షణకు తగిన ఏర్పాట్లు గావిస్తున్నారు. ప్రతియేటా వీరు చందాలు ఇస్తున్నారు. కొందరి దాతల సహకారం కూడా ఆవుల జీవనానికి తోడ్పడుతోంది.

సమాజ సేవకే పాల వాడకం



ప్రస్తుతం 15 ఆవుల నుంచి పాలు తీస్తున్నాం. ఆ పాలను సమాజ హితానికి వినియోగిస్తాం. ఆయుర్వేద వైద్యానికి, పాలులేని పసిబిడ్డల కోసం, అభిషేకాల నిమిత్తం ఈ పాలు కావాలని వచ్చినవారికి అందిస్తాం. కొందరు రైతులు పండ్ల తోటల సంరక్షణ కొరకు జీవామృతంగా ఆవు పంచతాన్ని వాడుతారు. వచ్చినవారికి వాటిని అందజేస్తాం.

- ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ముక్తిదామ గోశాల ప్రెసిడెంట్

టీటీడీ సహకారంతో...

గోశాల నిర్వహణకు తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం కూడా లభించింది. పుట్టా సుధాకర్‌యాదవ్ టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ముక్తిదామ గోశాల అభివృద్ధి కొరకు రూ.50లక్షలు మంజూరు చేయగా... తదనంతరం వైవీ సుబ్బారెడ్డి ఆ నిధులను రిలీజ్ చేసినట్లు గోశాల కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

కమలాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :పట్టణం లో దర్గా-ఎ గఫారియా, జహీరియా ప్రాంగణంలో శనివారం సాయంత్రందర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్‌షా ఖాద్రితో కలిసి ముస్లింలు రంజాన్ మాసాన్ని ఘనంగా స్వాగతించారు. మగ్రిబ్ నమాజ్ తరువాత ఆకాశంలో రంజాన్ నెల వంకను చూశారు. అనంతరం బాణసంచా పేల్చుతూ రంజాన్ మాసానికి ఘన స్వాగతం పలికారు. ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు పాటించాలని ఆయన ముస్లింలకు పిలుపునిచ్చారు.

కీర్తిపల్లెలో అధికారుల పర్యటన

వీరపునాయునిపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ,అనుబంధ శాఖల జిల్లా అధికారులు శనివారం మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో పర్యటించి ంది. గ్రామంలోని రైతుల ఆదాయం రెట్టింపు చేసే విధంగా గ్రామాన్ని తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో జిల్లా అధికారులందరూ గ్రామంలో పర్యటించారు. ఈ కార్య క్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, డ్వామా పీడీ,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ,ఉద్యానశాఖాధికారిసుభాషిణి,ప్రకృతి వ్యవ సాయం ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయండి

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నక్కలపల్లె సమ్మర్ స్టోరేజీలో ఏర్పడిన పైపులైను లీకేజీలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తాగునీరు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. నక్కలపల్లె సమ్మర్ స్టోరేజీలో పైపులైను లీకేజీ వల్ల పులివెందులలో ఏర్పడిన తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనరుతో కలిసి శనివారం నక్కలపల్లె స్టోరేజీ వద్ద జరుగుతున్న లీకేజీ మరమ్మతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన రు రాముడు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహబూబ్‌బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

వేంపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి మండల అధ్యక్షులకు సూచించారు. నియోజవకర్గంలోని 7 మండలాలకు నూతన అధ్యక్షులుగా నియామకమైన అనిల్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణ, శివశంకర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, రామాంజనేయరెడ్డి తదితరులు శనివారం తులసిరెడ్డిని కలిసి సత్కరించారు.

అర్హులకే జగనన్న కాలనీలో ఇల్లు

చెన్నూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో పక్కాగృహాలు మంజూరైన వారికి జగనన్న కాలనీ పేరుతో ఇళ్లను మంజూరు చేశారని, వారిలో అనర్హులున్నట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆ ఇళ్లపై వీఆర్వోలు సమగ్ర విచారణ చేసి అర్హులను మాత్రమే ఉండేలా చూడాలని ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్నారు. శనివారం చెన్నూరు తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన ఆయన కార్యాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి విషయంలో అనర్హులను గుర్తిస్తామన్నారు.అలాగే చాలా మంది నిరుపేదలు పక్కా ఇళ్లు లేక ప్రభుత్వ స్థలాలు, బంజరు భూముల్లో ఇల్లు నిర్మించుకుని ఉన్నారని, అవి 150 చదరపు అడుగుల వరకు ఉంటే వాటిని అక్కడ నివశించే వారికే ఎలాంటి రుసుం లేకుండా అందిస్తామని, అలా కాకుండా 300 చదరపు అడుగుల పైను ఉంటే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులర్ చేసుకునేందుకు ఫీజులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, డీటీవెంకటరమణ, ఆర్ఐ కౌశిక్ పాల్గొన్నారు.

శుద్ధినీరు..కలేనా..?

- పేద విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు కరువు
- ప్రభుత్వ పాఠశాలల్లో మూలన పడ్డ నీటిశుద్ధి ఫిల్టర్లు
- పట్టించుకోని అధికారులు

వేంపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఒక్క రూపాయి ఖర్చుపెడితే అంతకుమించిన ఆదాయం లేక ఉపయోగమో ఉండాలని కోరుకోవడం సర్వ సాధారణం. కానీ ప్రజాధనాన్ని ఖర్చుపెడుతు న్నామంటే అది ఏమైనా మనకేం సంబంధం అన్న ధోరణి ప్రజాప్రతినిధుల్లో ఎక్కువగా ఉంటుంది. ఇదే ధోరణి అధికారుల్లో కూడా కనిపిస్తోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చాలా మందిపేద విద్యార్థు లే చదువుకుంటున్నారు. వారి ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన నీరు తాగాలన్న ఉద్దేశ్యంతో తాగునీటి శుద్ధి ఫిల్టర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్త ఫిల్టర్లను ఆయా పాఠశాలలకు సదరు కంపెనీ పంపింది. కానీ పది నెలలకు పైగా ఆ వాటర్ ఫిల్టర్లు మూలనే పడి ఉన్నాయ. వాటిని బిగిస్తే పేద విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది. ఈ దుస్థితి వేంపల్లె మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో నెలకొని ఉంది.

మూలన పడ్డ ఫిల్టర్లు..: నాడు-నేడు కింద గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్యూరి ఫైడ్‌లను సరఫరా చేసింది. ఓ కంపెనీ ద్వారా పైస్థాయిలోనే కొనుగోలు చేసి పాఠశాలలకు పంపిణీ చేశారు. ధర రూ.30వేల నుంచి రూ.45వేలు పెట్టిన ప్పటికీ అంత విలువ ఆ ప్యూరిఫైడ్ ను సదరు కంపెనీ సిబ్బంది వచ్చి ఆ మిషన్‌ను బిగించాల్సి ఉంది. మండలంలో కుప్పాలపల్లె ప్రాథమిక పాఠ శాల, ఇడుపులపాయ మారుతీనగర్, అలిరెడ్డిపల్లె తదితర పదికి పైగా పాఠశాలలకు ఈ ప్యూరిఫైడ్‌లు సరఫరా చేశారు. ప్రస్తుతం ఇవన్నీ పది నెలలుగా మూలనే ఉన్నాయి. ఉపాధ్యాయులు ఆ ప్యూరి ఫైడ్‌లను బిగించుకునే ప్రయత్నం చేయగా కంపెనీ వారే వచ్చి బిగించాలనే మెలిక ఉండడంతో వారు స్థానిక మండల విద్యాశాఖాధికారుల దృష్టికి పలు మార్లు తీసుకొచ్చారు. కారణం ఏదైనా అటు కంపెనీ వారు రాలేదు, ఇటు ఉపాధ్యాయులు వదిలేయడతో మూలనపడ్డాయి. ఇదే పరిస్థితి కొనసాగితే అవి అలాగే చెడిపోయే ప్రమాదం ఉంది. మూలనపడ్డ వాటర్ ప్యూరిఫైడ్ మిషన్‌ను బిగించిపేద విద్యార్థులకు శుద్ధినీటిని అందించేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అలిరెడ్డిపల్లె పాఠశాలలో మూలనపడ్డ కొత్త ప్యూరిఫైడ్ మిషన్

బడ్జెట్ కాపీలు దహనం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ దేనికీ పనికిరాదని జనాభా ప్రాతిపదికన కేటాయించాలని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర కార్యాలయం వద్ద బడ్జెట్ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ రాష్ట్రకార్యదర్శి షేక్ మక్బూల్ బాష, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాన్‌బాష, షబ్బీర్,జిలాన్, చోటే తదితరులు పాల్గొన్నారు.

యువతకు భరోసా లేని బడ్జెట్..: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు భరోసా లేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం జిల్లా కార్యాలయంలో విలేకరులతో శివకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, విజయ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమం విచారం..: రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి కడప జిల్లా సైనిక సంక్షేమ సంఘం సభ్యులు విచారం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో సైనిక సంక్షేమ శాఖను పూర్తిగా విస్మరించడమే ఇందుకు కారణంగా తెలిపారు.

సీపీ బ్రౌన్ గ్రంథాలయం పనితీరు అభినందనీయం

కడప కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జానమద్ది హనుమచ్ఛాస్త్రి కృషితో రూపొందించిన సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రభుత్వ సహకారంతో వైవీయూ ఆధ్వర్యంలో ఔత్సాహికుల నిరంతరశ్రమతో కొనసాగుతున్న తీరు అభినందనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎర్రముక్కపల్లెలో ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయనను పరిశోధన కేంద్రం ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో ఆ కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, సహాయకులు హరిభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు కానుకల వితరణ

కడప మారుతీనగర్, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): కుల,మతాలు వేరైనా మనమంతా భారతీయులమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు షేక్ ఇలియాస్, నూరుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌జీఓ కాలనీలో ఉన్న బీజేపీ జిల్లా కార్యాల యంలో ముస్లింలకు కానుకల వితరణ గావించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వి.వి. చలపతి, లక్ష్మీనారాయణరెడ్డి, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్‌కుమార్, జిల్లా నాయకులు ప్రవీణ్‌నాయుడు, సురేంద్ర, మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకురాలు షకీలాబేగం, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం గురించి తెలుసుకోవాలి

సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వం గురించి తెలుసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత సూచించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని 1 నుంచి 7వ తేదీ వరకు జరిగే కార్యక్రమాలలో భాగంగా శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి పాతబస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిం చారు. అలాగే మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామం లో సూపర్‌వైజర్ మాబున్నీ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు.కార్యక్రమంలో మెప్మా సీఓ రామాంజ నేయులు, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు మేలు చేకూర్చే అద్భుతమైన బడ్జెట్ అన్నారు. శనివారం కడప ద్వారకానగర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రూ.3,22,359కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలు, తాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి ఎటువంటి నిధులు విడుదల చేయక, వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. తల్లికి వందనం, పింఛన్లు, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధులు కేటాయించారన్నారు. నగర ఉపాధ్యక్షుడు పఠాన్‌మన్సూర్‌అలీఖాన్, కార్పొరేటర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఆరోగ్యం



క్రీడలను ప్రారంభిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

సికెదిన్నె, మార్చి 1 (ఆంధ్ర జ్యోతి): క్రీడల ద్వారా వి ద్యార్థులు మానసిక, శారీర క ఆరోగ్యం మెరుగుపడు తుందని కడప కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపా రు. స్థానిక శ్రీచైతన్య విద్యా సంస్థల్లో శనివారం డాక్టర్ బీఎస్‌రావు మెమోరియల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్ర ముఖ విద్యాసంస్థ అయిన చైతన్య విద్యాసంస్థలు ప్రారంభించి ఉన్నత విద్యను సామా న్యులకు కూడా అందించడం జరిగిందన్నారు. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల ద్వారా మానసిక బలాన్ని, క్రమశిక్షణను నేర్చుకుని జీ వితంలో ఉన్నతస్థాయికి ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యాసం స్థల ఏజీఎం రమణయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికనుగుణంగా ఆధునిక వి ద్యాప్రమాణాలను మార్పులకు అనుగుణంగా రూపొందిస్తూ పేద విద్యార్థులకు కూడా విద్యను అందుబాటులోకి తెచ్చి ప్రోత్సహించిన ఘనత బీఎస్‌రావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఆర్ఐలు, ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్‌లు, ఇన్ చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



గంగమ్మతల్లిని దర్శించుకుంటున్న క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

సికెదిన్నె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మతల్లిని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి శనివారం దర్శించుకున్నారు. గంగమ్మ జాతర సందర్భంగా శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు..:చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం వద్ద బండలాగుడు పోటీ లు భక్తులను ఎంతగానో అలరించాయి. మొత్తం ఆరు జతల ఎద్దులు బండలాగుడు పో టీల్లో పాల్గొన్నాయి. అనంతరం గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులను అందింజేశారు.

'బడ్జెట్‌లో హామీలకు మొండిచేయి'

కడప మారుతీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో హామీలకు మొండి చేయి చూపించారని వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.వి. సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన 2025-26 సంవత్సర వార్షిక బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ పథకాల అమలుకు సరిపడే నిధులే కేటాయించలేదన్నారు. టీడీపీ దోపిడీ బ్యాచ్‌తో పవన్‌కళ్యాణ్ చేతులు కలపడంతో ఆయనపై ప్రజలకున్న గౌరవం మసకబారుతోందన్నారు.

వైర్‌లెస్ సెక్యూరిటీ సిస్టంతో దొంగతనాలకు అడ్డుకట్ట

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల డివిజను పరిధిలోని పోలీసుస్టేషన్ పరిధిలో వైర్‌లెస్ సెక్యూరిటీసిస్టంతో దొంగతనాలు అరికట్టవచ్చని డీఎస్పీ మురళి తెలిపారు. శనివారం డివిజను పరిధిలోని ఎస్ఐలు, సీఐలకు వైర్‌లెస్ సెక్యూరిటీ సిస్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రిరాముడి కల్యాణానికి వేంపల్లె తలంబ్రాలు



సిద్ధం చేసిన తలంబ్రాలతో మహిళలు

వేంపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని భద్రాద్రిరాముడి కల్యాణోత్సవంలో ఉపయోగించే తలంబ్రాలను వేంపల్లె నుంచి పంపిస్తున్నారు. ఆర్యవైశ్యమహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో మహిళలు గోటితో వడ్లను ఒలిచి బియ్యాన్ని తయారు చేశారు. ఆ బియ్యాన్ని తలంబ్రాలుగా ఉపయోగించేందుకు భద్రాచలం పంపించనున్నట్లు ఆర్యవైశ్య మహిళా మండల అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ తెలిపారు. ఆలయ పూజారి ఇంద్రకంటి ప్రసాదశర్మ పూజల అనంతరం తలంబ్రాలను తయారుచేసి సిద్ధం చేశారు. వీహెచ్‌పీ ప్రతినిధి రామచంద్రన్, మహిళలు పాల్గొన్నారు.

అమీన్‌పీర్ దర్గాను దర్శించిన మెహరీన్



కడప కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత పెద్దదర్గాను శనివారం సినీ నటి మెహరీన్ దర్శించారు. దర్గాకు చేరుకోగానే ఆమెకు దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మెహరీన్ మాట్లాడుతూ పెద్దదర్గాను తాను రెండో సారి దర్శించుకోవడం పట్ల చాలా ఆనందంగా ఉందన్నారు. .

'ప్రభుత్వ కక్షసాధింపునకు పరాకాష్ఠ'

కడపసెవెన్ రోడ్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ 2025-26 కేటాయింపుల్లో జిల్లా ప్రజల ఆకాంక్ష ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం, ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో కోతలు పెట్టడం కక్షసాధింపునకు పరాకాష్ఠ అని సీపీఐ నేతలు తెలిపారు. శనివారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. ఏ అంటే అమరావతి పీ అంటే పోలవరం అనే విధంగా వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే మరోమారు విభజన ఉద్యమానికి ఆజ్యం పోసినట్లు అవుతుందన్నారు.

ఉమెన్ సేఫ్టీపై అవగాహన సదస్సు

చక్రాయపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట జూనియర్ కళాశాల విద్యార్థినిలకు ఉమెన్‌సేఫ్టీపై అవగాహన సదస్సు ఎస్ఐ కృష్ణయ్య ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన, మహిళలు సమాజంలో ఎలా నడుచుకోవాలి, ప్రవర్తన ఎలా ఉండాలి, ఏదైన సమస్య జరిగినపుడు పోలీసులకు తెలియ జేయాలని చెప్పారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి నుంచి ఎలా కాపాడుకోవాలనే విషయాలను తెలిపారు.

ఆడపిల్లలను చదివిద్దాం

వేముల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా అన్నారు. శనివారం మండలంలోని రాచకుంటపల్లె అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో బేటి పడావో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

కడప కలెక్టరేట్, మార్చి1(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 3,4 తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3, 4 తేదీలలో సాయంత్రం 4 గంటల నుంచి మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను జియోన్ కళాశాలలో ప్రిన్సిపాల్ రోడమెర్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేసే మహిళా ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పోటీలల్లో పాల్గొని విజయంతం చేయాలని రాష్ట్ర మహిళా ఉద్యోగ సంఘ నాయకురాళ్లు నిర్మలా జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు శాంతమ్మ,కన్వీనరు భారతి, గౌరీ, జ్యోతి పిలుపు నిచ్చారు.

వక్ఫ్‌బోర్డు సవరణలకు నిరసనగా 36గంటల నిరాహార దీక్ష


కడప నాగరాజుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించకూడదని అన్ని పార్టీల మద్దతు కోరుతూ ఆ బిల్లుకు నిరసనగా ఆదివారం పాత రిమ్స్ వద్ద 36గంటల నిరాహార దీక్ష చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీస్ సయ్యద్ గౌస్‌పీర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణితో నేడు వక్ఫ్ భూములు, రేపు క్రైస్తవ భూములు, హిందూ మాన్యాలపై ఇలాంటి చర్యలు తీసుకుంటుందన్నారు.

వృద్ధుల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం

కమలాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా 1వతేదీన ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేయడం ద్వారా వృద్ధుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శనివారం నగర పంచాయతీ 3వ కౌన్సిలరు పరిధిలోని జెండా చెట్టు వద్ద వృద్ధులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, రామవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, నాగేంద్రవల్లె రామసుబ్బారెడ్డి, మస్తానయ్య, మహేశ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తు

ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎ.వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తుకు చేరుకోగలరని ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నగరంలోని ఎన్జీఓ కాలనీ గురుకుల విద్యాపీఠ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ ఎ.ఎల్.వివేకానంద, బి.పల్లవి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కడప వండర్‌లాను శనివారం ప్రారంభించి మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రొద్దుటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు ఎంఎల్ఎస్ పాయింట్‌ను జిల్లా పౌర సరఫరాల గ్రేడ్ 1 అధికారిణి వాణి తనిఖీ చేశారు. శనివారం ఆమె జమ్మల మడుగు రోడ్డుగల ప్రభుత్వ గోదాములలో రేషన్‌బియ్యం స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి గోదాములో ఉన్న బియ్యం బస్తాల నిల్వలను పరిశీలించారు. అనంతరం 40 మంది గోదాములో కూలీలు ఉండగా కేవలం 15 మంది ఉండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్‌దుకాణాలకు సరుకు వెళ్లే సమయంలో ఇంతమందికి సెలవు ఎలా ఇచ్చారని గౌడౌన్ డిటీ లింగస్వామిని ప్రశ్నించారు.

చెత్త సేకరణపై అవగాహన

గోపవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గోపవరం గ్రామ పంచాయతీలోని పెద్దగోపవరం, చిన్న గోపవరం దళితవాడ గ్రామాలలో చెత్త సేకరణపై పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. పంచాయతీ రాజ్ కమిషనరు ఆదేశాల మేరకు ప్రతిఇంటికీ వెళ్లి గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను తీసుకుని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సంచుల్లో కానీ బుట్టలో కానీ వేయించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అక్కడ వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు అందించాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణం

జమ్మలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణమని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ ఉపాధ్యక్షుడు సుబహాన్, కమిటీ సభ్యుడు యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడుగా గోసంగి సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడుగా గోసంగి సుబ్బారెడ్డి నియమితులయ్యారు. శనివారం ఆమేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి సుబ్బారెడ్డిని పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ పట్టణ అధ్యక్షుడుగా అవకాశమిచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ బాషా, చాపాడు మండల అధ్యక్షుడు చాపాటి రామసుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు

మైదుకూరు రూరల్ ,మార్చి1(ఆంధ్రజ్యోతి :జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 26 మంది విద్యార్థులకు కంటి అద్దాలను వైద్య సిబ్బంది శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్‌మాస్టర్ రామ్మోహన్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి. చంద్రమౌళి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు మృతి

ముద్దనూరు మార్చి1(ఆంధ్రజ్యోతి):స్థానిక పాత బస్టాండులోని బస్‌షెల్టర్‌లో శనివారం గంధం మునయ్య(65) అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు.బంధువుల సమాచారం మేరకు వివరాలు...తిరుపతికి చెందిన మునయ్య అనారోగ్యంతో బస్‌షెల్టర్‌లో పడుకొని మృతి చెందాడు. ఎస్‌ఐ మైనుద్దీన్, రెవెన్యూ సిబ్బంది వివరాలు ఆరాతీసి తిరుపతిలోని మృతిని కుమారునికి సమాచారమిచ్చారు.

4న సామాజిక బహింగ సభ

కలసపాడు మార్చి1(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పంథకంపై ఈనెల 4న కలసపాడులో 18వ సామాజిక బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్‌బీ తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, నిధులపై సభలో చర్చించడం జరుగుతుందన్నారు.

ధరల్లేక పండుమిర్చి రైతుల పాట్లు

● తెగుళ్లు ఒక వైపు.. తగ్గిన దిగుబడులు మరో వైపు ● పెట్టిన ఖర్చులు వచ్చేలా లేవంటున్న వైనం ●ఆందోళనలో అన్నదాతలు



పుల్లీడు గ్రామంలో రాశులుగా పోసిన ఎండుమిర్చి

పోరుమామిళ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి):అనుకూలించని వాతావరణం. ఓ వైపు తెగుళ్లు.. మరో వైపు తగ్గిన దిగుబడి..దీంతో కనీస ధరల్లేక పండుమిర్చి రైతు విలవిల్లాడుతున్నాడు. వ్యవసాయాన్ని నమ్ముకుని లక్షలకు లక్షలు పెట్టుబడి పెడితే దిగుబడి తగ్గడం, రేట్లు గణనీయంగా తగ్గడంతో పరేషాన్‌లో పడిపోయారు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లో 600 ఎకరాలకు పైగా పండుమిర్చిని రైతులు సాగు చేశారు. పోరుమామిళ్ల మండలంలోని పుల్లీడు గ్రామంలోనే దాదాపు 300 ఎకరాలు పండుమిర్చి సాగు చేశారు. ఎకరాకు లక్ష నుంచి లక్షా 40వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని సేద్యాలకే మరో 20వేలు, మిరప నారుకు, ఎరువులకు, కూలీల పెట్టుబడులు ఎక్కువవుతాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పండు మిరపకు వాతావరనం అనుకూలించకపోవడం, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గి ధరకూడా పడి పోయాయని రైతులు చెబుతున్నారు. గత ఏడాది క్వింటా రూ.18వేలు ధర పలుకగా, ప్రస్తుతం రూ.12వేలు, రూ.13వేలు ధర పలుకుతోందన్నారు. మిర్చి బాగా పండితే ఎకరాకు 15 క్వింటాళ్లపైన దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం వాతావరణం తెగుళ్ల కారణంగా ఎకరాకు పది క్వింటాళ్లు, ఐదు క్వింటాళ్లు నాలుగు క్వింటాళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. కనీసం పెట్టుబడులైనా వెళితే ఈ సారి గడ్డున పడతామంటున్నారు. అంతేకాకుండా గుంటూరుకు మిరప గ్రేడింగ్ చేసి తీసుకెళ్లాలని, క్వాలిటీ బట్టి అక్కడ ధర నిర్ణయిస్తారన్నారు. అంతేకాక మిరపకు ఇంత వరకు ఇన్సూరెన్స్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అలాగే రంగసముద్రం, నర్సింగపల్లె, గురప్పగారిపల్లె ప్రాంతాల్లో కూడా ఈ పండుమిర్చి సాగు చేసిన రైతులు కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఈ నష్టాలు కోలుకోలేనట్లుగా దెబ్బతీస్తున్నాయన్నారు.

ధర తగ్గడంతో దిక్కుతోచడం లేదు



పండుమిర్చి ధర గణనీయంగా తగ్గడంతో దిక్కుతోచని పరిస్థితి. 20 ఎకరాల్లో పండు మిర్చి సాగు చేసి 25లక్షలు పెట్టుబడి పెడితే కనీసం పెట్టుబడులు కూడా వచ్చే స్థితి లేకుండా పోయింది. గత ఏడాది క్వింటా రూ.18వేలుధర పలికితే ప్రస్తుతం రూ.12వేలు, 13వేలకు అడుగుతున్నారు.

\- గుర్విరెడ్డి, పుల్లీడు, పోరుమామిళ్ల మండలం

తెగుళ్లు దెబ్బతీశాయి



నల్లి తెగుళ్లు వాతావరణం అనుకూలించకపోవడంతో పండుమిర్చి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఐదెకరాల్లో పండు మిర్చి సాగు చేశాం. కనీసం ఎకరాకు 4క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కానరావడంలేదు. పండుమిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- ఖాజావలి, పుల్లీడు, పోరుమామిళ్ల

విద్యార్థులు ఉన్నత ప్రగతికి బాటలు వేసుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఉన్నత ప్రగతికి బాటలు వేసుకోవాలని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తరుణేందుశేఖర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం ఆ కళాశాల ఫేర్‌వెల్‌డే వేడుకలు రాయల్‌కౌంటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని సూచించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అందువలన విద్యను ఎప్పుడు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుదేవ్ రామిరెడ్డి, అంకాల్‌కొండయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఏవో రాజు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చంద్రబాబు కృషి

ప్రొద్దుటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసన సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు, మతాలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్థికంగా చితికి పోయిన రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. భారీ బడ్జెట్ ప్రవేశపెట్టినందున ప్రజలు సంపూర్ణంగా సహకరించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లోనే తల్లికి వందనం పథకం కింద 15000, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు 20వేలు అందజేయ నున్నారన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు నాగముని రెడ్డి, పగిడాల దస్తగిరి మార్తల గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరసాగరం పుస్తకం ఆవిష్కరణ

ఖాజీపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట టీటీడీ కల్యాణ మండపంలో శనివారం అక్షరసాగరం పుస్తకాన్ని అధికారభాషా సంఘం పూర్వ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య ఆవిష్కరించారు. అనంతరం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూలు ప్రధానోపాధ్యాయులకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఘనంగా సన్మానించారు. అలాగే పూర్వ విద్యార్థులు, మండల ప్రజలు స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డిని, ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్‌కుమార్, మూల మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, పుత్తా బాలిరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, చైతన్య స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, నరసింహారెడ్డి, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌హౌస్‌పై విద్యార్థులకు అవగాహన

అట్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్‌హౌస్‌పై అట్లూరు ఎస్‌ఐ రామక్రిష్ణ అవగాహన కల్పించారు. పిస్టల్ గన్ ఎలా ఉపయోగించాలి, లాకప్ గురించి వివిధ రకాల కేసుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెంలో: రాజుపాలెం హైస్కూలు విద్యార్థులకఉ శనివారం చట్టాలపై అవగాహన సదస్సు ఎస్‌ఐ వెంకటరమణ ఏర్పాటు చేశు. ఈసందర్భంగా మహిళలు బాలికలకు సంబంధించిన నేరాలపై వారికి అవగాహన కల్పించారు.

కొండచిలువలకు నిలయంగా విద్యుత్ కార్యాలయం



కార్యాలయంలోకి కొండచిలువ వచ్చిన దృశ్యం

ప్రొద్దుటూరు , మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని సౌత్ సెక్షన్ కార్యాలయం కొండచిలువలకు నిలయంగా మారింది. శనివారం తెల్లవారుజామున సౌత్ సెక్షన్ కార్యాలయం గోడ కూలి పోయింది. అయితే ఆసమయంలో ఎవరు లేనందున ప్రమాదం జరగలేదు. చాలా కాలంగా కార్యాలయం గోడకు నెర్రలు చీలి వాలి ఉండడం ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డుకు ఆనుకోని ఉండటం రోజు వందలాది భారీ వెహికల్స్ వెళుతుండటం వలన ఆ కార్యాలయం గోడ కూలిపోయింది అంతేకాక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో ఉన్న ఈ సౌత్‌సెక్షన్ కు నూతన భవనం నిర్మాణంకోసం 30 లక్షల అంచనాతో టెండర్లు సైతం పూర్తి అయ్యాయి. కానీ బైపాస్ విస్తరణ వల్ల నూతన కార్యాలయ భవనం పనులు ఆగిపోయాయి. కార్యాలయం కూలిపోవడంపై ఏఈ గోరంట్ల లక్ష్మీనారాయణను వివరణ కోరగా టెండర్లు అయినా రోడ్డు విస్తరణలో కార్యాలయంతో పాటు సబ్‌స్టేషన్ పోతుందని అందువల్ల నిర్మాణ పనులు ఆగిపోయాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని స్థలం కేటా యిస్తే అక్కడ నూతన కార్యాలయం నిర్మిస్తామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించగా అరగంట ముందుగానే పోలీసులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మొదటి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూబాషా పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 2439 మంది విద్యార్థులకుగాను 2336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 103 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 9 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి.

కొండాపురంలో: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఈ పరీక్షాకేంద్రంలో పరీక్షలు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు.శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా, 100 మంది విద్యార్థులకు గాను, నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షా కేంద్రంపై నిఘా ఉంచినట్లు తెలిపారు. పరీక్షకేంద్రాన్ని సిట్టింగ్‌స్క్వాడ్ ,ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం తనిఖీ చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

లక్ష్మినరసింహస్వామికి జలాభిషేకం

బద్వేలు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి కుంభమేళా నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పలురకాల పూలమాలలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంతా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అభిషేక జలాలను పంచిపెట్టారు. అనంతరం మద్యాహ్నం బయనపల్లె గ్రామానికి చెందిన మేకపాటి హరిక్రిష్ణరెడ్డి కుటుంబ సభ్యులు అన్న ప్రసాద కైంకర్యం నిర్వహించారు.

బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చాపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ట్రైనింగ్ డీఎస్పీ భవానీ అన్నారు. చాపాడు పోలీసు స్టేషన్‌లో శనివారం కస్తూర్బాగాంధీ గురుకుల బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ డీఎస్పీ విద్యార్థినులకు నేరాలకు సంబందించిన కేసులు, సెక్షన్లు, పోలీసుల విధులు, రికార్డులను గురించి వివరించారు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య మాట్లాడుతూ బాలికలకు చదువు బాగా ముఖ్యమైనదన్నారు.

బియ్యం వాహనం ఆపరేటర్‌పై కేసు నమోదు

ప్రొద్దుటూరు , మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యంను ఏకంగా ప్రభుత్వ బియ్యం వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న సుబ్రమణ్యం అనే వ్యక్తి పై 6 ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్‌సప్లయ్ డీటీ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సుబ్బిరెడ్డి కొట్టాలలోని ఒక రేషన్ దుకాణం నుంచి బియ్యం బండిలో రేషన్ బియ్యం తరలిస్తుండగా సివిల్ సప్లయి సిబ్బంది మహేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ రేషన్ బండిలో 24 రేషన్ బియ్యం బస్తాలు ప్లాస్టిక్ సంచుల్లో వేసుకోని వెళుతుండగా పట్టుకోని ఆపరేటర్ సుబ్రమణ్యంపై కేసు నమోదు చేశామని పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికమిటీ సభ్యుడిగా వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఆమేరకు శనివారం డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం తనవంతు పాటుపడతానని తెలిపారు. అన్నవరం రామ్మోహన్‌రెడ్డి పగిడాల దస్తగిరిలు ఉన్నారు.

వివేకానంద సేవాశ్రమంలో అన్నవితరణ

కాశినాయన మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం సమీపంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో శనివారం ఎక్కంటి ఆంజనేయులు ఆధ్వర్యంలో అనాథలకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. వారి తల్లి ఎక్కంటి వెంకటలక్ష్మమ్మ 14వ వర్ధంతిని పురష్కరించుకొని అనాధ వృద్ధులకు భోజనాలు, స్వీట్లు,పండ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పలువురు మిత్రులు పాల్గొన్నారు.



చాపాడు మండలం లక్ష్మీపేట గ్రామ పశువైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేపిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతోపాటు చుట్టూ కంపచెట్లు అలుముకుని ఉండడంతో మూగజీవాలు మేత కోసం వెళ్లి ప్రమాదానికి గురవుతున్నాయి. మూడు నెలల క్రితం రెండు మేకలు మృత్యువాత పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -చాపాడు, (ఆంధ్రజ్యోతి)

ఇళ్ల సర్వేలు పకడ్బందీగా చేయాలి : డీపీవో



తిప్పలూరులో మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

ఎర్రగుంట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూ సర్వేలో బాగంగా ఇళ్ల సర్వేని పకడ్బందీగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని తిప్పలూరులో ఆమె శనివారం పర్యటించి మ్యాప్‌ల ఆధారంగా కచ్చితమైన సర్వే చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. స్వామిత్వపై ఆమె సిబ్బందితో చర్చించారు. చిలమకూరు, తిప్పలూరు, చిర్రాజుపల్ల, పోట్లదుర్తి, కలమల్ల, వెంకటాపురం గ్రామాల్లో ఇంకా సమగ్ర భూ సర్వేలో ఇళ్ల సర్వేలు చేయాల్సి వుండగా వాటిపై సమీక్షించారు. తడిచెత్తను, పొడిచెత్తను వేరుగా సేకరించాలన్నారు. సిబ్బందితో కలిసి ఆమె వీధుల్లో పర్యటించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో ఎన్టీఆర్ పించన్‌ను పరిశీలించి కొందరికి పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ తంతులయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

ముద్దనూరు మార్చి1(ఆంధ్రజ్యోతి):ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో శనివారం డీపీవో పర్యటించి అందులో భాగంగా పరిశుభ్రత పాటించాలని, చెత్తను రోడ్డు పై వేయకుండా చెత్త బుట్టల్లో నింపి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేయు విధనాన్ని ప్రజలకు తెలియజేశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు వెళ్లి వర్మీకంపోస్టు తయారు చేయు తొట్లలో వానపాములను వదిలారు. అనంతరం పించన్ల పంపిణీ పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు, ఈవో నరసింహులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్

జమ్మలమడుగు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని భారతీయ స్టేట్‌బ్యాంకు చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదురుగా శనివారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెజీషియన్ హరేరాం వారిచే కళాజాత జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమ్మలమడుగు భారతీయ స్టేట్‌బ్యాంకు చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫోన్ స్కాంకు సంబంధించి ఆన్‌లైన్ ఉద్యోగాలు, లాటరీ, తప్పుగా నగదు బదిలీలు, కేవైఎసీ గడువు ముగిసిందని, పన్ను వాపసలు తదితర అంశాలపై ఖాతాదారులను మోసం చేస్తారన్నారు. అలాంటి సమస్యలు నేషనల్ సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబరు 1930 ఫోన్ చేసి వెంటనే తెలుపాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కౌన్సిలర్


●పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



వైసీపీ కౌన్సిలర్ వరలక్ష్మీ దంపతులను పార్టీ లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :ప్రొద్దుటూరులో మరో వైసీపీ కౌన్సిలర్ పోసా వరలక్ష్మీ ఆమెభర్త పోసా భాస్కర్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్ పోసా వరలక్ష్మీ దంపుతులు పార్టీలో చేరారు. ఆమేరకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్ట పోయిందని గుర్తించి వైసీపీ నుంచి వచ్చే వారందరిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. పోసా వరలక్ష్మీకి 34 వవార్డులో సంపూర్ణ సహకారం అందించి వార్డు అభివృద్ధికి అన్ని విదాల సహకరించ డంతోపాటు వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు బచ్చల ప్రతాప్ మాజీ కౌన్సిల్లర్ తలారి పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన భూపేశ్‌రెడ్డి



టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో అదిష్ఠానం పిలుపుమేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబందిత అధికారులతో సమస్యలను పరిష్కరించాలని భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మరికొన్ని సమస్యలను పుస్తకంలో రాశారు. జమ్మలమడుగు మండలంలోని కొన్ని గ్రామాల నుంచి కొందరు స్థలాలు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంబవరం రామయ్య, సంజీవ పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ వైస్‌చైర్మన్‌గా సీవీ సుబ్బారెడ్డి



చలమల వెంకటసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

బద్వేలు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వైస్ చైర్మన్‌గా బద్వేలు పట్టణానికి చెందిన చలమల వెంకట సుబ్బారెడ్డిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం కడప పట్టణంలోని ఎన్‌సీఆర్‌సీ కార్యాలయంలో ఆ సంస్థ జాతీయ చైర్మన్ సాయి రమేశ్, సౌత్ జోన్ చైర్మన్ తాడె సత్యనారాయణ ఆదేశాల మేరకు నూతన కమిటీలో ఎంపికైన వారందరికీ నియామ కపత్రాలను అందించినట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన చలమల వెంక టసుబ్బారెడ్డిని ఆ సంస్థ సభ్యులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా తన నియామ కానికి సహకరించిన సాయి రమేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.